క్లుప్తంగా

రెయిన్‌గేజ్ పరిశీలన

సంగం: మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలోని రెయిన్‌గేజ్‌ను జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి లక్ష్మీనరసింహులు గురువారం పరిశీలించారు. రెయిన్‌గేజ్ పనితీరు, లోపాలను ఏఎస్ఓ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రెయిన్‌గేజ్‌కు సంబంధించి రికార్డులను పరిశీలించారు.

క్రీడాకారులకు అభినందనలు



ఉదయగిరి: ఆత్మకూరులో జరిగిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర కళాశాలల జోనల్‌స్థాయి క్రికెట్ పోటీల్లో ఉదయగిరిలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రిన్సిపల్ ఎల్ నారాయణస్వామి గురువారం అభినందించారు. పీడీ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



అల్లూరు: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ సౌజన్య అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో కిశోరి వికాసంపై శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల సమస్యలు, సంరక్షణ, నైపుణ్యాలు, బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, ఆహారం, ఆరోగ్యం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ రజనికాంత్, సూపర్‌వైజర్ రాజేశ్వరి, డాక్టర్ నవీన్‌కుమార్,మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

అనుమసముద్రంపేట: గుంపర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చిన్నాబత్తిన శివకుమార్‌ను ఎంఈఓ జ్యోతి, హెచ్‌ఎం పోతులూరయ్య గురువారం సన్మానించారు. 2024లో 22 క్యాజువల్ లీవులకుగానూ ఒక్కటి కూడా వాడుకోకుండా పాఠశాలకు హాజరుకావడంపై అభినందించారు.

వేమన శతక కంఠస్థ పోటీలు

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేమన శతకం కంఠస్థ పోటీలను గురువారం నిర్వహించారు. విజేతలుగా శంకర్, నిహారిక నిలువగా అనంతపురానికి చెందిన వేమన ఫౌండేషన్ సౌజన్యంతో హెచ్‌ఎం సురేష్ చేతుల మీదుగా జ్ఞాపికలు, వేమన శతకం పుస్తకాలను అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా రమణరాజు, కృష్ణారెడ్డి, మదీనా వ్యవహరించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట/సీతారామపురం: ఏఎస్‌పేట. సీతారామపురం మండలాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి జీవనోపాధి కల్పించే నిమిత్తం బీసీ సంక్షేమశాఖ, ఇతర కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓలు పీ ప్రసన్నకుమారి,భాస్కర్ గురువారం తెలిపారు. ఏఎస్‌పేట మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా 30 మంది, కాపు కార్పొరేషన్ ద్వారా నలుగురు, రెడ్డి కార్పొరేషన్ ద్వారా నలుగురు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా ఐదుగురు, కమ్మ కార్పొరేషన్ ద్వారా ఇద్దరు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా ఒకరికి చొప్పున 46 మందికి రుణాలను మంజూరు చేయనున్నారు. అలాగే సీతారామపురం మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా 30 మంది, కాపు కార్పొరేషన్ ద్వారా నలుగురు, రెడ్డి కార్పొరేషన్ ద్వారా ముగ్గురు, ఈబీసీ, కమ్మ కార్పొరేషన్‌ల ద్వారా నలుగురు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా ఒకరికి చొప్పున మొత్తం 42 మందికి రుణాలను మంజూరు చేయనున్నారు. అర్హులైన వారు ఈ నెల 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓలు కోరారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే విషాదం

సోమశిల: కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే తిరుపతిలో విషాదం చోటు చేసుకుందని జిల్లా వైఎస్సార్‌సీపీ యాక్టివిస్ట్ సెక్రటరీ బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైకుంఠ ద్వారా దర్శనం టోకన్ల జారీకి సంబంధించిన క్యూలైన్లలో నిబంధనలు పాటించకుండా పలువురి ప్రాణాలు కోల్పోవడానికి కారణమైనటువంటి టీటీడీ పాలకమండలిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలన్నారు. మృతుల కుటుంబాలకు కోటిరూపాయల చొప్పున పరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి టీటీడీలో ఉద్యోగావకాశం, గాయపడిన ప్రతిఒక్కరికీ రూ.10లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



పార్కులో సరదాగా గడుపుతూ..



బొమ్మలపై తిరుగుతున్న చిన్నారులు



ఊయలలో ఉల్లాసంగా..

నగరవనం.. ఆహ్లాదకరం

కావలి పట్టణానికి నగర వనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మైమరపించే పచ్చదనం, అడవిని తలపించే పరిసరాలు, ఆకర్షించే జంతువుల బొమ్మలు ఇలా పట్టణ ప్రజలకు అన్నివిధాలా ఆహ్లాదాన్ని అందిస్తోంది. కాగా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన కావలి వాసులు ప్రస్తుతం సంక్రాంతికి వస్తుండగా వారిని నగర వనం ఎంతో ఆకట్టుకుంటోంది. కుటుంబ సమేతంగా వచ్చేసి ఆహ్లాదంగా గడుపుతున్నారు. పిల్లలను ఆడిస్తూ సేదతీరుతున్నారు.



ట్రెక్కింగ్ చేస్తున్న చిన్నారి



నగర వనంలోని వాకింగ్ ట్రాక్

- పట్టణ వాసులను ఆకర్షిస్తున్న పార్కు
- మెరుగైన వసతుల ఏర్పాటు

కావలి : పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో నగర వనం గతేడాది డిసెంబర్ 14న ప్రారంభమైంది. పట్టణంలోని రిజర్వు ఆటవీ ప్రాంతంలోని 125 ఎకరాల్లో రూ.2 కోట్లతో నగర వనాన్ని నూతనంగా నిర్మించారు. 2023 డిసెంబర్‌లో నిర్మాణ పనులు ప్రారంభించగా, సరిగ్గా ఏడాదికి ప్రారంభించారు. కాగా క్యాంటీన్‌లో స్నాక్స్ అమ్మకాలు, ఇంకొంత భాగంలో కొత్తగా మొక్కలు నాటాల్సి ఉంది. ఈ నగర వనంలో యోగా కేంద్రం, వాకింగ్ ట్రాక్‌లు, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్, క్యాంటీన్, మినరల్ వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఆట విడుపుగా సందర్శకులను ఆకర్షించేలా వసతులు సమకూర్చారు. ఇక్కడ వేప, నేరేడు, రావి, కదంబ, ఉసిరి, బాదం, ఎర్రచందనం తదితర 15 రకాల చెట్లు వెయ్యికి పైగా ఉండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. అంతే కాకుండా ఆరు కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్‌పై నడుస్తూ ప్రకృతిని ఆస్వాదించవచ్చు. ఆట వస్తువులు, జంతువుల బొమ్మలు పిల్లలను ఆకర్షించేలా తీర్చిదిద్దారు. అధునాతన ఆట వస్తువులు, జిమ్ ఐటమ్స్‌ను సమకూర్చారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో..

నగర వనం చుట్టూ మూడు కిలోమీటర్ల మేర ప్రధాన మార్గాలను, అంతర్గత రహదారులను నిర్మించారు. కాగా నగరవనాన్ని నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్వహణ ప్రజల సహకారంతో చేసుకోవాల్సి ఉంటుంది. వాచ్‌మెన్‌లు, చెత్తా చెదారాలను తొలగించే సిబ్బంది, మొక్కలు పెంపకం- వాటి పర్యవేక్షణ, విద్యుత్ బిల్లులు, మరుగుదొడ్లను శుభ్రపరచడం తదితర వాటి నిర్వహణ కోసం ప్రవేశ రుసుము పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10, వాకర్స్‌కు నెలకు రూ.300 ఫీజును ఖరారు చేసి అమలు చేస్తున్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రతిరోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పార్కు ఓపెన్ చేసి ఉంచేలా చర్యలు తీసుకున్నారు.

మంచిగా నిర్మించారు



మేము చెన్నైలో నివాసం ఉంటున్నాం. సంక్రాంతి పండగ కోసం కావలిలో ఉన్న మా తల్లిదండ్రుల వద్దకు వచ్చాం. నగరవనం చాలా బాగుంది. కావలిలో చాలా మంచిగా నిర్మించారు. పిల్లలు, పెద్దలకు అన్నీ ఉన్నాయి.

– ప్రియ, గృహిణి, చెన్నై

సూపర్‌గా ఉంది



మా చెన్నైలో ఉన్న పార్క్‌లో ఇలాంటివి లేవు. ఇక్కడ ఆడుకోవడానికి చాలా పెట్టారు. ఈ పార్క్‌ను ఎప్పటికీ మర్చిపోను. కావలికి వచ్చినప్పుడు ఈ పార్క్‌కు వస్తుంటాను.

– ఇవాన్, నాల్గో తరగతి

పిల్లలకు ఆట విడుపు



సంక్రాంతికి కావలిలో మా అన్నావదినల ఇంటికి వచ్చాం. కారులో వస్తుంటే చూసి ఇక్కడికి వచ్చాం. చాలా బాగుంది. పిల్లలు సరదాగా ఆడుకుంటున్నారు. నగరాల్లోని పార్కుల్లో సైతం పిల్లలు కోసం ఇన్ని రకాల ఐటమ్స్ ఉండవు. వసతులు కూడా బాగున్నాయి.

– సౌజన్య, గృహిణి, గుంటూరు

ఆహ్లాదకరంగా ఉంది



ఇక్కడి పార్కులో చాలా రకాల ఐటమ్స్ పెట్టారు. సిటీల్లోని పార్కుల్లో సైతం ఇలా ఉండదు. మొక్కలు చాలా చక్కగా ఉన్నాయి. రోడ్లు, వాకింగ్ చేయాలనిపించేలా ఉన్నాయి

– పవిత్ర, చెన్నై

మాఊరిలో ఇవన్నీ లేవు



ఇక్కడే ఉండి చాలా సేపు ఆడుకోవాలని ఉంది. కొత్తగా అనిపించింది. మా గుంటూరులో ఇవన్నీ లేవు. ఎక్కువ సేపు ఆడుకున్నాం.

– తన్విక, రెండో తరగతి

ప్రజలే కాపాడుకోవాలి

నగర వనాన్ని పట్టణ ప్రజలే కాపాడుకోవాలి. పూర్తిగా పచ్చదనంతో కూడిన మొక్కలతో అభివృద్ధి చేశాం. పిల్లలు, పెద్దలు సరదాగా ఆడుకునే ఆట వస్తువులు, జిమ్ పరికరాలు, వాకింగ్‌కు అనువుగా ఉండేలా రోడ్లు, టాయ్‌లెట్ వసతి కల్పించాం. టెండర్ ప్రక్రియ ద్వారా క్యాంటీన్‌ను నిర్వహణ బాధ్యతలు అప్పగించాల్సి ఉంది.

– కె.రామిరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కావలి

అభివృద్ధి లేదు.. పథకాలు లేవు

- బాబును నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారు
- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా సంక్షేమ పథకాలు లేవు. అభివృద్ధి ఊసు లేదు. అందుకే ప్రజలు చంద్రబాబు దొంగ హామీలను నమ్మి మోసపోయామని బాధపడుతున్నారని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని తన స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గురించి ప్రజలు మాట్లాడుతున్న మాటలను తన నోటితో చెప్పలేనన్నారు. ప్రశ్నిస్తానని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ గొంతు మూగబోవడంతో ప్రజల తరుపున వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తోందన్నారు. అందుకే కరెంట్ బిల్లులు వీర బాదుడుపై తాము చేపట్టిన ఆందోళనకు పెద్ద ఎత్తున ప్రజలు మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు. టీడీపీ నాయకులు డబ్బా కొట్టుకోవడంలో స్పెషలిస్టులని, ఈ విషయంలో కావలి ఎమ్మెల్యే రెండాకులు ఎక్కువగా చదవారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనులను విస్మరించి వైఎస్సార్‌సీపీపై దాడులు, అక్రమ కేసులు, వేధింపులకు గురిచేసే పనిలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. ఏడు నెలల కాలంలో అభివృద్ధి పనులు ఒక్కటీ చేయలేదన్నారు. తుమ్మలపెంట రోడ్డును డిసెంబరు 31లోగా పూర్తి చేసి కొత్త సంవత్సరం వేడుకలు దానిపై చేస్తామని డాంబికాలు పలికిన ఆయన ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. రూ.14 కోట్లతో చేపడుతున్న రోడ్డు పనుల్లో ఇప్పటి వరకు రూ.2 కోట్ల పనులను కూడా పూర్తి చేయలేదన్నారు. తుమ్మలపెంట రోడ్డుకు తాను నిధులు మంజూరు చేయించగా, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టడానికి ఆసక్తి చూపకపోవడంతో ప్రారంభం కాలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే తన 150 టిప్పర్లు ఖాళీగా ఉండకుండా, తన కంకర క్వారీ నుంచి కంకరను సేల్స్ చేసుకోవడానికి మాత్రమే తుమ్మలపెంట రోడ్డు నిర్మాణం అంటూ ప్రజలను మభ్యపెడుతున్నాడన్నారు. కావలి ట్రంక్‌రోడ్డుకు రూ.55 కోట్లు మంజూరు చేయిస్తే ప్లానింగ్ ప్రకారం కాకుండా అస్తవ్యస్తంగా పనులు చేపడుతున్నారని మండిపడ్డారు. ముసునూరులో ఒక తాత్కలిక రోడ్డును నిర్మించి ఏదో అద్భుతం చేశామంటూ ఎమ్మెల్యే చౌకబారు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. కావలి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని బుద్ధి ఉన్న ఎవరూ అంగీకరించరన్నారు. దాన్ని నిలుపదల చేయడానికి తాను కూడా పోరాడుతానన్నారు. ఈ విషయంలో కూడా తమపై బురదజల్లి పబ్బం గడుపుకోవాలని చూడడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లను ధ్వంసం చేయడం, వాటిలో స్థలాలను కొనుగోలు చేసిన వారిని మనోవ్యధకు గురిచేయడం, సబ్‌రిజిస్ట్రార్‌లపై రాజకీయాలు చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతూ రియల్ ఎస్టేట్ రంగాన్ని కుప్పకూల్చేశారని ఆరోపించారు. స్వయంగా ఎమ్మెల్యేనే రియల్ ఎస్టేట్ వెంచర్ వేస్తూ పోటీదారులను దెబ్బకొట్టాలనే లక్ష్యంతో ఇలాంటి పనులు చేసినట్లుగా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారితో కలిసి బిల్డింగ్ అనుమతుల కోసం లంచాలు తీసుకుంటున్నారని, అందులో ఎమ్మెల్యే కూడా వాటాదారుడని ఆరోపించారు. ఎమ్మెల్యే చేస్తున్న అక్రమాలపై తాము పోరాటం చేస్తామన్నారు. తిరుపతిలో 6 మంది భక్తులు చనిపోవడం బాధాకరమని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

30 నుంచి జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాలు

దుత్తలూరు: నర్రవాడలోని జనార్దనస్వామి ఆలయలో జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాలను ఈ నెల 30 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మాదాల ఎస్ బాబూరావు తెలిపారు. గురువారం ఆయన దేవస్థానంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి ఆలయం శిథిలావస్థకు చేరుకోగా ప్రభుత్వం మంజూరు చేసిన సీజీఎస్ ఫండ్స్ రూ.33.33 లక్షలు, దాతల అందించిన విరాళాలు రూ.1 కోటితో తిరిగి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు వివరించారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చివరిరోజు ఫిబ్రవరి 3న వేదపారాయణం, కలశ ఆరాధనలు, యంత్రప్రతిష్ట, విమాన కలశ ప్రతిష్ట, మహాపూర్ణాహుతి, జనార్దనస్వామి కల్యాణోత్సవం, గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. చినజీయర్‌స్వామి హాజరై మంగళ శాసనములు అందించనున్నట్లు వివరించారు. స్థానికులు బోగినేని రామచంద్ర, మాదాల తిమ్మయ్యచౌదరి పాల్గొన్నారు.

పాత గ్రాంటుతో సీసీరోడ్డు పనులు


- కొత్తగా కేటాయించినట్లుగా సంబరాలు
- సోషల్‌మీడియాలో పోస్టులు
- టీడీపీ నాయకుల తీరుపై విమర్శలు

ఆత్మకూరురూరల్: మహిమలూరు పంచాయతీ పరిధిలోని కోటపాడు గ్రామానికి సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రూ.74 లక్షలను మంజూరు చేయించారు. అప్పట్లో కొన్ని కారణాలతో పనులను ప్రారంభించలేదు. అయితే అవే నిధులతో రోడ్డు పనులను మరోసారి మంజూరు చేసినట్లుగా ఇటీవల నాగులపాడులో పర్యటించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. గతంలో ఉన్న నిబంధనల ప్రకారం కాకుండా పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ విభాగంలో పనులు చేపట్టేలా కొత్త నిబంధనలు తెచ్చి స్థానికంగా ఉన్న ఓ నాయకుడికి పనులు అప్పగించారు. కోటపాడు నుంచి మహిమలూరు-నాగులపాడు రోడ్డు వరకు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టేందుకు జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ పనులను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకుని తామే రోడ్డు నిర్మాణానికి నిధులను సాధించినట్లుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం చర్చనీయాంశమైంది. పాత గ్రాంటుతోనే పనులు చేస్తూ సంబరాలు జరుపుకోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ విషయమై పీఆర్ ప్రాజెక్ట్ విభాగం జేఈ సాంబశివారెడ్డిని వివరణ కోరగా, పాత గ్రాంటుతోనే పనులు చేపడుతున్నది వాస్తవమేనని తెలిపారు.


సోషల్ ఆడిట్ సమావేశం వాయిదా

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి గత పదిరోజులుగా క్షేత్రస్థాయిలో జరిపిన తనిఖీలపై శుక్రవారం నిర్వహించనున్న సోషల్ ఆడిట్ సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది ముందస్తుగా ప్రకటిస్తామని పేర్కొన్నారు.


పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



సంగం జెడ్పీహెచ్‌ఎస్‌లో భోగిమంట వేస్తున్న దృశ్యం



వింజమూరు: రవి పాఠశాలలో..



సీతారామపురం: వేదగర్భ పాఠశాలలో..



వింజమూరు బీసీ కాలనీ పాఠశాలలో..

ఆత్మకూరు/బిట్రగుంట/ అనుమసముద్రంపేట/ సీతారామపురం/ఆత్మకూరురూరల్/సంగం/ ఉదయగిరి: ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగవల్లులు తీర్చిదిద్ది భోగి మంటలు వేశారు. గొబ్బెమ్మ పాటలు పాడారు. హరిదాసులు, కాటిపాపడు, సంక్రాంతిలక్ష్మి, గోదాదేవి, తదితర వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఆత్మకూరు పట్టణంలోని లెర్నింగ్ ట్రీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ మేకపాటి శైలజ, ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్ షేక్ షకీల, వెన్నవాడ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కలిశెట్టి రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. అనుమసముద్రంపేటలోని ఠాగూర్ పాఠశాలలో కరస్పాండెంట్ రమణారెడ్డి, డైరెక్టర్ దొరస్వామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగిమంటలు వేసి గాలిపటాలను ఎగురవేశారు. సంగం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బుజ్జయ్య ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పండరి భజన, కోలాటాన్ని ప్రదర్శించారు.వింజమూరులోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, రవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటలు, రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బీసీ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. సీతారామపురంలోని వేదగర్భ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో డైరెక్టర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులపై తల్లిదండ్రులతో భోగిపండ్లు పోయించారు. అనంతరం భోగిమంటలు వేసి కోలాటాన్ని ప్రదర్శించారు. విద్యార్థులకు ఆటలు, ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో హిందూ సంస్కృతి, తెలుగు రాష్ట్రాల సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తొలుత భోగి మంటలతో ప్రారంభించి అందమైన రంగవల్లులతో కళాశాల ప్రాంగణాన్ని ఇంద్రధనుస్సులా మార్చారు. ఆచార వ్యవహారాలు, పండుగల్లో దాగిన సైన్స్‌ను, సంప్రదాయాల పేరుతో పెద్దలు అలవాటు చేసిన ఆరోగ్యకరమైన అలవాట్లను గుర్తుచేసేలా సంక్రాతి వేడుకలను నిర్వహించారు. అనంతరం రంగవల్లుల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి సునీల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త కిరణ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అనుమసముద్రంపేట: ఠాగూర్ పాఠశాలలో..



ఆత్మకూరు: లెర్నింగ్ ట్రీ పాఠశాలలో..



బిట్రగుంట: ఆర్ఎస్ఆర్ కళాశాలలో ..



ఆత్మకూరురూరల్: వెన్నవాడ పాఠశాలలో..

జూదాలు నిర్వహిస్తే చర్యలు

సీతారామపురం: మండలంలో సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, తదితర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శివకృష్ణారెడ్డి గురువారం హెచ్చరించారు. సంక్రాంతిని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

కావలి-వింజమూరు బస్సు సర్వీసు ప్రారంభం

వింజమూరు(ఉదయగిరి): కావలి నుంచి వింజమూరుకు ప్రతిరోజూ రాత్రి 9.30 గంటలకు నూతనంగా బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా కావలి నుంచి వింజమూరుకు రాత్రి 7 గంటల తరువాత నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు బస్సు సర్వీసులు లేవు. దీంతో కావలి రైల్వే స్టేషన్‌లో దిగే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. రాత్రి 9.30గంటలకు నూతన బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

జలదంకి: రైతులు తప్పనిసరిగా తమ పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి పీ సత్యవాణి సూచించారు. చామదల, బ్రాహ్మణక్రాక గ్రామాల్లో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈక్రాప్ చేసుకోకపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ పరికరాలు అందవని తెలిపారు.